క్లుప్తంగా

అండర్- 17 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

వాల్మీకిపురం : నవంబరు 2న వాల్మీకిపురం జీవిఎస్‌సిఎస్ క్రికెట్ క్రీడా మైదానంలో ఎస్‌జిఎఫ్ అండర్ -17 బాల, బాలికల జట్లు ఎంపిక జరుగుతుందని ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శులు సురేష్, వసంత, విజయలక్ష్మి తెలిపారు. సెలక్షన్స్‌కు హాజరయ్యే క్రీడాకారులు స్టడీ సర్టిఫికెట్లు, చైల్డ్ ఐడి, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరుకావాలన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు తెల్లటి దుస్తులు, క్రికెట్ కిట్ తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8317558306ను సంప్రదించాలని కోరారు.

రేపు చీకటిపల్లిలో నల్లగంగమ్మ విగ్రహ ప్రతిష్ట

కలికిరి : మండలంలోని చీకటిపల్లి గ్రామ కస్పాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం శిఖర కళశ స్థాపన, 2న ఉదయం 7.30గంటకు అమ్మవారి మూల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

పీలేరు : విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు ప్యాక్టరీ నిర్మాణం డిమాండ్‌తో నవంబర్ 8న నిర్వహించనున్న విద్యా సంస్థ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.ఎల్. వెంకటేష్, కార్యదర్శి జక్కల వెంకటేష్ కోరారు. మంగళవారం పీలేరులో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది విద్యార్థి యువకుల ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఫ్యాక్టరీ మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేసే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నసీఫ్, ముబారక్, శ్రీకాంత్, సంపత్, డీవీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బద్దే భాను ప్రకాష్, జనసేన నాయకులు పవన్‌కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని తహసీల్దారు భాగ్యలత అన్నారు. కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని అండేకురవపల్లి హరిజనవాడలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకూడదని, పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. క్యాక్రమంలో ఎంపీడీఓ గంగయ్య, ఏఎస్ఐ మధుసూదనాచారి, విఆర్ఓ విశ్వనాధ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

పీలేరు రూరల్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని డీఎం బి. కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో సుండుపల్లె - సోమల రోడ్డులో ప్రయాణికులకు లక్కీ డిప్ ద్వారా బహుమతులు అందజేశారు. సుడుపల్లె - పీలేరు రోడ్డులో తిమ్మసముద్రానికి చెందిన రజావుల్లా, గర్నిమిట్టకు చెందిన ఎం. నబి, పీలేరుకు చెందిన టి.రమేష్, సోమల - కలకడ మార్గంలో సోమలకు చెందిన ఎస్. రహంతుల్లా, మదనపల్లెకు చెందిన శ్రీరాములు, కలికిరికి చెందిన అనితాజ్‌లకు ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమలుతు మౌర్య కంటి ఆసుపత్రి సౌజన్యంతో అందజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి బహుమతులు సొంతం చేసుకోండని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మ, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, డాక్టర్ మౌర్య రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

ములకలచెరువు : స్థానిక మండల కేంద్రం తంబళ్లపల్లె క్రాస్ వద్ద వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను నిర్వాహకులు ప్రదానం చేశారు.

ఖవ్వాలీ పోటీలు



ములకలచెరువు : స్థానిక మండల కేంద్రం కదిరి రోడ్డులో వెలసిన మహబూబే సుబహానీ దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ఖవ్వాలీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా సాయంత్రం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖవ్వాలీ పోటీలు అందరిని ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యంలో స్థానికులు పాల్గొని తరించారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హతను మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నారన్నారు. నిరుద్యోగులు చిన్న ఉద్యోగమైనా నిరాశ పడకుండా ఉద్యోగంలో చేరి అంచలంచెలుగా ఎదగాలని సూచించారు. యువతకు మెరుగైన జీవితం కల్పించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. జాబ్ మేళా అనేది నిరంతర ప్రక్రియ అని, చదువుకున్న ప్రతి వ్యక్తి నిరుద్యోగిగా మిగులకూడదనేది సీఎం లక్ష్యమన్నారు. యువత లక్ష్యసాధన దిశగా చిత్తశుద్ధితో కష్టపడి పని చేస్తే ఎంత కష్టమైన పని కూడా విజయం సాధించవచ్చునన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంటు ప్రవేశపెట్టి ఎంతో మంది నిరుపేద బిడ్డలకు విద్యను అందించి బంగారు బాటలు వేశారన్నారు. ప్రస్తుతం ఆయన కుమారుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు జగనన్న కానుక, అమ్మ ఒడి, విద్యా దీవెన, జగన్న వసతి దీవెన, మనబడి నాడు నేడు వంటి పథకాలతో విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు అందిస్తున్నారన్నారు. అనంతరం 18 కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 784మంది హాజరై 208 మంది ఉద్యోగాలు పొందారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, శివానందరెడ్డి, నీళ్ళభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, అబ్దుల్ కలీమ్, రాయుడు, వివిధ కంపెనీల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్నివర్గాలకు మేలు

ఎమ్మెల్యే నవాజ్‌బాషా



గుడిసెవారిపల్లెలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : రాష్ట్రంలో జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోంది. ప్రతి కుటుంబంలో అన్నలా, తమ్ముడిలా, కొడుకులా, మనువడిలా ఉంటూ ముఖ్యమంత్రి ప్రజల అవసరాలను తీరుస్తున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా పేర్కొన్నారు. మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ గుడిసెవారిపల్లెలో మంగళవారం సర్పంచ్ బోర్‌వెల్ మహేష్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న తీరును వివరిస్తూ.. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన బుక్‌లెట్స్‌ను అందించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జగనన్న పాలనలో పేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో అవినీతిరహిత పాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని అన్నారు. రోజు రోజుకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఆయనను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ సంతోషం వ్యక్త పరుస్తుంటే టీడీపీ, జనసేన నాయకులు ఓర్వలేకపోతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని, పిల్లల భవిష్యత్తు బాగుపడాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రెడ్డిరాణి, వెలుగుచంద్ర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలు నాగరాజ, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, ఎంపీడీఓ భానుప్రసాద్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ సేవలు ప్రశంసనీయం

మదనపల్లె సిటీ : దేశానికి మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలు ప్రశంసనీయమని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రెడ్డిసాహెబ్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక బెంగుళూరు బస్టాండులోని ఇందిరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆమె మృతి చెందిన ఇప్పటికి దేశ ప్రజలు మరువలేరన్నారు. పంచవర్ష ప్రణాళికలు అమలు చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ జనరల్ సెక్రటరీ చంద్రకళ, మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, సురేంద్రరెడ్డి, డాక్టర్ ఎస్.కె.బాషా, మహబూబ్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం : మండలంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన పక్కా గృహాల నిర్మాణం వేగవంతానికి చర్యలు చేపడుతున్నామని హౌసింగ్ డీఈ సీహెచ్ శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్.శ్రీహరి అన్నారు. మంగళవారం వారు మండలంలోని కందుకూరు, పులికల్లులోని జగనన్న లేఔట్లలో నిర్మితమౌతున్న గృహాలను పరిశీలించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణాలను బట్టి దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తామన్నారు. అదే విధంగా కాలనీల్లో ప్రధానంగా బోరు డ్రిల్లింగ్ చేయించి నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. నిర్మాణాలు పూర్తయిన అనంతరం కాలువలు, తాగునీటి పైప్‌లైన్,విద్యుత్ సౌకర్యంతో కూడుకున్న అన్ని వసతులు సమకూర్చేందుకు ఆయా శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేస్తామని డీఈలు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి తక్షణ సాయం

కురబలకోట : మండలంలోని దాదంవారిపల్లె గ్రామం జోగి నాగరాజు కుటుంబానికి తక్షణ సాయంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్యంతో జోగి నాగరాజు మృతి చెందాడు. ఇతనికి కుటుంబానికి మార్కెట్ కమిటీ చైర్మన్ డీఆర్. ఉమాపతి రెడ్డి, ఎంపీటీసీ నిర్మల, విశ్వేశ్వర్ రెడ్డి మంగళవారం వైఎస్సార్ భీమా కింద తక్షణ సాయం అందజేశారు. రాజశేఖర్‌రెడ్డి, సుమతి, సచిన్, సత్యవేణి, నాగభూషన్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పౌష్టికాహారం అందించండి

– ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి

వాల్మీకిపురం : గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక చాకలవీధిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో మెరుగైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో ఉదయ్‌కుమార్, ఈవోపిఆర్‌డి పాండు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కలికిరిలో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : కలికిరి-2 గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యసేవలు

మదనపల్లె : జగనన్న ఆరోగ్య సురక్షతో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 18వవార్డుకు సంబంధించి కోటబడి హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషా ప్రజలకు వైద్యశిబిరంలో అందిస్తున్న సేవలను నేరుగా పరిశీలించారు. వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, శిబిరం నిర్వహణపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ... సచివాలయ వ్యవస్థతో సీఎం జగన్ గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చారన్నారు. ఈ క్రమంలోనే పల్లె ముంగిట వైద్యం అందేలా ప్రతి పంచాయతీలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు నూర్‌ఆజం, జింకాచలపతి, కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, డిష్‌రామకృష్ణారెడ్డి, ఎస్వీ.రమణ, రామిశెట్టిశివయ్య, రేణుక, ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, తట్టిశ్రీనివాసులురెడ్డి, వినుతాబాయి, చరణ్, జేసీఎస్ కన్వీనర్ బావాజీ, రహీం, బండిమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితాపై సలహాలు స్వీకరణ

ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



మదనపల్లె : ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇటీవల విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, సలహాలు ఉంటే ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను ఆర్డీఓ ఎం.ఎస్.మురళి కోరారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె నియోజకవర్గంలోని రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె మండలాలతో పాటుగా, మున్సిపాలిటీకి సంబంధించిన బీఎల్వోలు, సూపర్‌వైజర్‌లు, ఏఈఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మురళీ మాట్లాడుతూ..బీఎల్వోలు, రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రతి ఒక్కరూ ముసాయిదా జాబితాలో ఏమైనా తప్పులున్నాయా అని పరిశీలించాలన్నారు. ఒక వేళ ఉంటే, సంబంధిత సూపర్‌వైజర్‌కు తెలపాలన్నారు. ముసాయిదాపై అభ్యంతరాలను డిసెంబర్ 9వ తేదీ వరకు క్లెయిమ్స్ స్వీకరిస్తామన్నారు. జాబితాను పబ్లిక్ డొమైన్‌లో కూడా అందుబాటులో ఉంచామని, ప్రజలు తమ పేర్లను సరిచూసుకోవాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియని, బీఎల్వోలు ఓటరునమోదుకు సంబంధించి ఫారం-6,7,8లు తప్పనిసరిగా తీసుకుని అప్‌డేట్ చేయాలన్నారు. బీఎల్వోలు, బీఎల్ఏలతో సమన్వయం చేసుకుని ఓటరుజాబితా పారదర్శకంగా రూపొందేలా చూడాలన్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న 250 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 9 నూతన కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో డీఏఓ శేషయ్య, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్‌లు మహబూబ్‌చాంద్, దైవరాజన్, సీ.ఆర్.మంజుల పాల్గొన్నారు.

బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏ.వి.సుబ్బారెడ్డి సస్పెన్షన్

మదనపల్లె : భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు, రాజంపేట పార్లమెంటరీ మాజీ అధ్యక్షులు డాక్టర్.ఏ.వి.సుబ్బారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ ఉత్తర్వులు ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడిగా ఉంటూ పార్టీ విధానాలపై, నాయకులపై అనుచిత, అభ్యంతరకర వ్యాఖ్యలతో పాటు అసభ్యపదజాలాన్ని వాడినట్లు తెలియడంతో వాస్తవాలను రాష్ట్ర అధ్యక్షురాలుకు 10 రోజుల్లో రాతపూర్వకంగా లేదా మౌఖికంగా తెలపాల్సిందిగా అక్టోబర్ 16, 2023న నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసుకు డాక్టర్.ఏ.వి.సుబ్బారెడ్డి నుంచి ఎలాంటి వివరణ, సంజాయిషీ లేకపోవడంతో పార్టీ క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడినట్లు భావించి సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

ఘనంగా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి



పీలేరులో వల్లభాయ్ పటేల్ చిత్రపటంతో ర్యాలీ

వాల్మీకిపురం : ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని గండబోయనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, అధ్యాపకులు నారాయణ స్వామి, సుదర్శన్, కిషోర్, రెడ్డిమోహన, మురళి, శ్రీకాంత్, శేఖర్, ఉషారాణి, శ్రీలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సమైక్యతా దినోత్సవం

మదనపల్లె సిటీ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం సమైక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పటేల్ దేశానికి చేసిన సేవలను గురించి వివరించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు .ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సేగు రెడ్డప్పరెడ్డి విద్యార్థులచే జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, నాయకులు భగవాన్, ఎల్లంపల్లి ప్రశాంత్, బి.రవికుమార్, నాగరాజ, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వల్లభాయ్‌పటేల్

కలకడ : ఏకత్వం సాధించడానికి, సమానత్వం పంచడానికి ఎనిలేని కృషిచేసి, యువతకు ఆదర్శప్రాయుడుగా నిలచిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్‌పటేల్ అని ఎంపీఈ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సర్దార్‌వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయనచిత్రపటానికి పూజలు చేసి నివాళ్ళుఅర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమైక్యత అనే నినాదం అందరిలో రావాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, ఏపీఓ చెన్నకేశవులు, కమలాకర్‌రెడ్డి, మండల పరిషత్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత, సమగ్రతకు ప్రతీక వల్లభాయ్ పటేల్

పీలేరు రూరల్ : జాతీయ ఐక్యత, సమగ్రతకు ప్రతీక భారత దేశ ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎంఈఓ పద్మావతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నటరాజ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని పీలేరు పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం 562 సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దేశానికి మొదటి హోం మంత్రిగా, ఉప ప్రధానిగా, సమాచార ప్రసారాల శాఖ మంత్రిగా విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, మురళి, శివకుమార్, శిరీష, నాగవేణి, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాయజ్ఞానికి తరలిరండి



ప్రచార రథానికి స్వాగతం పలుకుతున్న విశ్వ హిందూ పరిషత్ సభ్యులు

వాల్మీకిపురం : జనవరి 21న తిరుపతి ఎస్వీ యూనివర్శిటీ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించనున్న కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞాన్ని విజయవంతం చేయాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ప్రచార ప్రముఖ్ లింగంశెట్టి శంకర తెలిపారు. టీటీడీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ప్రచార రథం మంగళవారం వాల్మీకిపురంకు చేరుకొని, పట్టణంలోని పురవీధుల గుండా మదనపల్లికి బయల్దేరింది. జనవరి 21న మఠాధిపతులు, పీఠాధిపతులు, సాధు సంతువుల ఆధ్వర్యంలో ఈ కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రమేష్, రమణమ్మ, చంద్రయ్య, వెంకట్రమణ, చంద్రశేఖర్, వెంకటస్వామి, లోక్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి



కొత్తపల్లి లేఅవుట్ పనులను పరిశీలిస్తున్న ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, తహసీల్దారు

కలికిరి : కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కె.కొత్తపల్లి వద్ద ప్రభుత్వ లేఅవుట్‌లో అర్హులకు త్వరితగతిన ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి తహసీల్దారు భాగ్యలతను కోరారు. గతంలో లౌఅవుట్‌కు భూములు ఇచ్చిన రైతులకు సాంకేతిక కారణాలతో నష్టపరిహారం జమకానందున లేఅవుట్‌లో నిర్మాణాలు వాయిదాపడ్డాయి. ఇటీవల సంబంధిత రైతులకు నగదు జమకావడంతో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో లేఅవుట్ అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం లేఅవుట్‌ను పరిశీలించిన హరీష్ రెడ్డి అక్కడ ప్లాట్లుకు హద్దు రాళ్ల ఏర్పాటు చేసి ఇది వరకే పట్టాలిచ్చిన లబ్ధిదారులకు ఇవ్వాలన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. లేఅవుట్ సమీపంలో కాలువ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దు



సమస్యలను తెలుసుకొంటున్న తహసీల్దార్

గుర్రంకొండ : బాల్యవివాహాలను ఎవరు కూడా ప్రోత్సహించవద్దని తహసీల్దార్ ఖాజాబీ అన్నారు. మంగళవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని చెర్లోపల్లె దళితవాడలో దళితులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా బాగా చదివించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం దళితులు తమ కాలనీలొ నెలకొన్న సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలు పలుచోట్ల సీసీరోడ్లు వేయాలన్నారు. విద్యుత్ తీగలు ఇళ్లపై వెళుతున్నాయని, వర్షాలు కురిసినప్పుడు ఇబ్బంది పడుతున్నామన్నారు. కాలనీలో పలుచోట్ల వీధిదీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. . కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహలక్ష్మీ, ఎంఈఓ సుబ్రమణ్యం, ఆర్ఐ మహేష్, వీఆర్వో వెంకట్రమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలోని 35 వార్డుల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ.. మౌలికవసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఆజెండాలో 65 అంశాలను పొందుపరిచి, సభ్యుల ఆమోదం కోసం కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. ఇందులో ప్రధానంగా తాగునీటి సరఫరా, నీటిసమస్య పరిష్కారాలు, కొత్త బోర్ల డ్రిల్లింగ్, నూతన మోటార్ల అమరిక, పైప్‌లైన్ ఏర్పాటుకు సంబంధించి అన్నివార్డుల్లో కోటిరూపాయల నిధులతో ప్రతిపాదనలు ఉంచారు. అలాగే సీసీ రోడ్లు, డ్రైయిన్లుకు సంబంధించి రూ.8.35 కోట్లతో పనులను చేసేందుకు ప్రతిపాదనలు పెట్టారు. చిత్తూరు బస్టాండ్ సమీపంలోని టౌన్‌హాల్‌కు మరమ్మత్తులు, ఫ్లోరింగ్, టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు, పీఓపీ, పెయింటింగ్, ఎలక్ట్రిఫికేషన్, నీటిసరఫరాకు సంబంధించి రూ.52 లక్షలతో అంచనాలు తయారు చేశారు. ఏపీ మున్సిపల్ యాక్ట్‌ను అనుసరించి ఐదేళ్లకు ఒకసారి ట్రేడ్ లైసెన్స్ అమౌంట్ 50శాతం పెంచాల్సి ఉన్నందున 2023-24 ఆర్థికసంవత్సరం నుంచి ట్రేడ్‌లైసెన్స్ పెంపు అంశాన్ని అజెండాలో చేర్చారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి అజెండాలోని అన్ని అంశాలకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, వైస్‌చైర్మన్‌లు నూర్‌ఆజం, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై విచారణ జరపాలి

తంబళ్లపల్లె: నియోజకవర్గంలో నూతన ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియలో నమోదు చేసుకున్న దరఖాస్తులను బీఎల్‌వోలు వెంటనే విచారణ చేయాలని ఎన్నికల నిర్వహణ అధికారి రాఘవేంద్ర అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముసాయిదా ఓటర్ల జాబితా అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రచురించామన్నారు. ఆ జాబితాను పరిశీలించి తప్పు,ఒప్పులు ఉన్నా, మార్పులు, చేర్పులు ఉంటే గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. వలంటీర్ల ప్రమేయం లేకుండా బీఎల్‌వోలు జాగ్రత్త పడాలన్నారు. ఎక్కడా ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చూడాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో చర్చించారు. సమావేశంలో తంబళ్లపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, పెద్దమండ్యం డిప్యూటీ తహసీల్దార్ రవి, ములకలచెరువు తహసీల్దార్ సి.శ్రీనివాసులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె జెడ్పీహైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ ఖాజాబీ తనిఖీ చేశారు. మంగళవారం ఆమె స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉంచిన భోజనాన్ని తనిఖీ చేశారు. పులిహోర, చట్నీలను రుచి చూశారు. అనంతరం విద్యార్థులను విచారించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారని, ఈరోజు కూడా కోడిగుడ్డు ఇచ్చారని విద్యార్థినిలు తెలియజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించాలని, భోజనం తయారీలో నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమణమ్మ, ఆర్ఐ మహేష్, ఉపాధ్యాయులు వెంకట్రమణ పాల్గొన్నారు.